# మృత్యుచ్ఛాయ

"రేపొద్దున .... తెల్లారే సరికి .... వాడి చావు కబురు అందాలి. ఎలాగా రాత్రికి వాడి మాగాణి వరికుప్పల దగ్గరకు వెళతాడు. ఆ దోవంటే!....జాగ్రత్త! పాము....మంచిదేనా ? కోరలు తియ్యలేదు కదా? నీటిపాము కాదు కదూ ? గుసగుసగా అడిగాడు గోపాలరావు పాములవాణ్ణి. అతగాడి చేతిలోని పచ్చనోటు.... చిరుగాలికి నాగుపాము బుసలా బుస బుసమంటున్నది.

పాములు పట్టే వీరిగాడు బుర్ర గిరగిర ఆడించాడు.

"తమరి కెందుకు బాబూ ? వెంకటాద్రిబాబు దోవంట రావటం ఆలస్యం, బుట్టలోంచి పామును వదిలేస్తాను. ఇందాకే పట్టాను దాన్ని. మంచి వయసులోవుంది. కోడెనాగు. నా మాట నమ్మండి. కోరలు పీకటం అప్పుడేనా ? అసలింక తమరు హాయిగా నిద్రపోండి ఇంటికెల్లి. తెల్లారే సరికి వెంకటాద్రిబాబు పాము కరచి చచ్చాడని ఊరంతా గగ్గోలైపోకుంటే అప్పు డడగండి నన్ను". నోటు, బుట్టలాటి తలపాగాలో దాచుకుంటూ అన్నాడు వీరిగాడు.

చుట్టూరా చీకటి ఆవరించు కుంటోంది. ఊరి కవతలగా వున్న చిట్టడవిలో నుండి నడచి వస్తున్నారిద్దరూ. పొలిమేరలోకి రాగానే గోపాలరావు మెల్లగా అన్నాడు "వీరిగా ! నువ్విక్కడే ఆగు. మనిద్దరం కలిసి వూళ్ళోకి వెళ్ళటం అంత బాగుండదు. నువ్వట్లా చేలకడ్డంపడి వెళ్ళు. నేనిట్లా బాటువెంటే వెళతాను."

"అట్లాగే :"

"ఇదుగో చూడు....పని సక్రమంగా నెరవేరిందో మరో నోటు కూడా నీదే!"

మరోమారు వీరిగాణ్ణి రహస్యంగా హెచ్చరించి బాటెంట గబగబా నడిచాడు గోపాలరావు. వీరిగాడు చేలవేపు వెళ్ళిపోయాడు. గోపాలరావు ఎంత వడిగా నడుస్తున్నాడో....అతగాడి ఆలోచనలుకూడా అంతదూకుడుగానూ సాగుతున్నాయి. వెంకటాద్రి తెల్లారేసరికి చస్తాడు. కత్తో, కర్రో ఉపయోగించి .... హత్యచేయిస్తే....అది రట్టయి .... కేసులు, గొడవలు నానాయాతనవుతుంది. పాములు పట్టే వీరిగాడికి పాములు పట్టడం పుట్టుకతో వచ్చిన విద్య. వాడు ఏలాటి పామునైనా పట్టగలడు. వాటిని ఒక్కోసారి బస్తీలకు తీసికెళ్ళి ఏవో మందుల కంపెనీలకు అమ్ముతున్నాడీ మధ్య. చచ్చిన పాముల చర్మం తీసి అమ్ముతుంటాడు అప్పుడపుడూ.

మొన్ననోసారి ఎవరో పెద్ద డాక్టరు సిటీలో ఏదో పరిశోధనకోసం, నాగుపాములు కావాలన్నాడట. నాలుగురోజుల్లో నాలుగు పాముల్ని పట్టి ఇచ్చి, రెండువందల రూపాయలు జేబులో వేసుకవచ్చాడు. ఆ సంగతి ఊరందరికీ తెలుసు. అంచేత వాడి దగ్గర ఒక్కసారిగా అంత డబ్బెట్లా వచ్చిందన్న అనుమానమూ ఎవరికీ కలగదు.

అదృష్టవశాత్తూ, ఈ రోజు మధ్యాహ్నం వాడు పెద్ద నాగుపామును పట్టిన సంగతి ఇంకా ఎవరికీ తెలియలేదు, తనకు తప్ప. అదయినా త్రోవలో వాడే అనటంవల్ల. ఆ క్షణంలో తన బుర్రలో తళుక్కున వెంకటాద్రి మెదిలాడు.అవును శాశ్వతంగా వెంకటాద్రి పీడ తను వదలించుకోవాలంటే ఇంతకు మించిన మార్గం మరొకటిలేదు.

అసలు వెంకటాద్రి బ్రతికుండగా తనకు పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు గిరి రాదు. అతగాడిలో ఏం శక్తివుందో, జనం గంగ వెర్రులెత్తి

నట్లు ఓట్లిస్తారు. తన భయానికి "నీకే ఇస్తాం" అంటారేగానీ, అది పేదవుల మీది పలుకే! ఫలితం ప్రతిసారి ఎలక్షన్‌లో తెలుస్తూనే వుంది.

నిజానికి తనకంటే ఆస్తిలో, అంతస్థులో, కులంలో కూడా వెంకటాద్రి తక్కువవాడే! కానీ జనానికి అదేం మోజో!

జనం మోజు ఎలా తగలడ్డా తనింతగా బాధపడేవాడుకాడు. తన మేనమామ కూతురు దుర్గ, పుట్టినప్పట్నుండీ తనకు "భార్య" అని అందరూ అంటూంటే, పుసుక్కున వెంకటాద్రిమీద మోజుపడింది. ఎవ రెన్ని అడ్డంకులు పెట్టినా, చివరకు తనే నచ్చచెప్పినా, తిట్టినా, కొట్ట బోయినా, విదిలించిపారేసి ఓ రాత్రికి రాత్రే వెంకటాద్రి ఇంటికి చేరి పోయింది.

ఆమటుకూ, మర్యాదగా వెంకటాద్రితో అంతక్రితం చెప్పి వున్నాడు తను. "వెంకటాద్రీ! అది నాక్కాబోయే భార్య. నువ్విలా దాన్ని పక్కమార్గాలకు లాగటం బాగలేదు" అని. వెంకటాద్రి నవ్వాడు. "చూడు గోపాలం! ఇతరులసొమ్ము కాజేయాలనే తత్వంకాదు నాది. కానీ ఓ ఆడపిల్ల, తనంత తానుగా నిన్నుతప్ప మరోణ్ణి పెళ్లాడను అని కాళ్ళకు చుట్టుకుంటే, చులకన చేసేంత ధైర్యంలేదు నాకు."

"అసలు నువ్వే దానికీ వెధవ బుద్ధులు నేర్పావు!"

"ఎట్లా అనుకున్నాసరే! ఇప్పుడయినా మించిపోయిందిలేదు. దుర్గ ఇష్టపడితే, నీకు నేను అడ్డురాను. పైగా వరసైన వాడివికూడాను!" అనేసి వెళ్ళిపోయాడు.

దుర్గ ఇష్టపడితే, ఇక చిక్కేముందీ? అత్త, మామ, తనూ, తన తల్లీ అంతా పట్టుబట్టారు. దుర్గను కట్టుదిట్టంచేసి, వారంరోజుల్లో

ముహూ ర్తం పెట్టించెయ్యాలని, తను పురోహితుడి దగ్గరకు వెళ్ళాడు పొరుగూరికి .... ముహూ ర్తం కోసం! కానీ ఆ రాత్రే దుర్గ ఎట్లా వెళ్ళిందో, అందరికళ్ళుగప్పి, వెంకటాద్రి పెళ్ళాడేశాడు.... మొదటి రాత్రి కూడా వెళ్ళిపోయింది!

ఆ వెంకటాద్రి అంటే తనకిక కోపంగాక ఏముంటుంది? పగగాక, ప్రేమ వస్తుందా?

దుర్గ మహా గడసరి. ఈ పెళ్ళి గొడవ కాస్త సర్దుకున్నాక స్వయంగా తనింటికి వచ్చింది. "బావా! జరిగిందేదో జరిగి పోయింది. నీ తోబుట్టువు లాటిదాన్ని.... బంధుత్వాలు తెంపుకున్నా, స్నేహితంగా వుందాం! అంది. అప్పుడప్పుడే తనకూ, వెంకటాద్రికి పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు పదవికి పోటీ ప్రారంభమౌతోంది.

"ఔనే దుర్గా!" అంది తల్లి....తనకు ఒళ్ళు మండిపోయింది.

"బంధుత్వాలు వద్దు, స్నేహాలు వద్దు. అసలు ఆడదానివి నీకీ పెత్తనాలేమిటి? అని కసిరి పంపేశాడు.

దుర్గ చిన్నబుచ్చుకో లేదు. ఓ విధంగా "నేనింత ఘనకార్యం చేశాను చూడు. నే కోరిన వాణ్ణి పెళ్ళాడాను!" అని తనని ఎద్దేవా చేయటానికి వచ్చినట్లనిపించింది, ఆమె నిర్లక్ష్యంగా వెళ్ళిపోతుంటే.

ఇక రేపు చూడాలి దాని మొహం. తను వెళ్ళి తెగ ఓదారుస్తాడు. నక్క ఏడుపులు ఏడుస్తాడు.

ఈ మధ్యే మంచంలో పడిన అమ్మ.... అస్తమానూ తననీ, కోడల్నీ సాధించటం మాత్రం మానలేదు. దుర్గ వెంకటాద్రిని పెళ్ళాడాక, ఆర్నెల్లు తిరక్కుండా పంతం కొద్దీ తనూ కమలను పెళ్ళాడేశాడు. కాస్త కట్నం

తక్కువ అయినా ఫర్వాలేదనీ, పేద ఇంటి పిల్లయినా మునిగి పోయింది లేదనీనూ.

అందాకా చాటు మాటుగా దుర్గను తిట్టిపోస్తున్న అమ్మ అదేం ఖర్మో, అస్తమానూ కమలకూ, దుర్గకూ పోటీ పెట్టడం సాగించింది.

"రాసిపెట్టక అట్లా జరిగింది గానీ, మా దుర్గే ఈ ఇంటి కోడలిగా వచ్చివుంటే ఈ పని ఇట్లా చేసేదా ? ఆపని అట్లా చేసేదా? నా మాట జవదాటేదా ?" అంటూ కమల చేసే ప్రతి పనిలో తప్పులు ఎత్తిచూపటం, తప్పులు లేకున్నా తప్పులు పట్టడం ఎక్కువైపోయింది.

ఒకటి రెండేళ్లు కమల కూడా చాలా ఓర్పుగా నోరు మెదపకుండా వుంది. తర్వాత ఆమెలో ఓర్పు నశించింది.

"వెళ్ళి ఆ దుర్గ దగ్గరే వుండండి - మాకూ మీ పీడా వదలి పోతుంది" అంటూనో, "నా చేతనైనట్లు చేసుకుంటాను ఏ పనైనా ! మీరెవరు నన్ను దిద్దటానికి?" అనో దులిపి వెయ్యటం మొదలుపెట్టింది.

దాంతో మూతి బిగింపులూ, అలకలూ, రాద్ధాంతాలూ, ఇల్లో నరకంగా మారిపోయింది తనకు. నిజానికి అస్తమానూ దుర్గతో పోటీ పెడుతుంటే తనకే చికాకుగా వుంది. మరి కమల ఎంతకని ఓర్చుకుంటుంది? ఇక కోడలు తన చెయ్యిదాటి పోయిందని తెల్సుకోగానే అమ్మ.... ఇక కొడుకు భరతం పట్టేస్తోంది.

"ఆ రాజకీయాలు నీ కెందుకురా గోపాలం ? ఈ పార్టీ పాడూ మనకెందుకురా ? అసలు ఎవడు ప్రెసిడెంటయితే ఏం పోయిందిరా ? నీ కంటే వెంకటాద్రే తెలివిగలవాడనిపిస్తోంది,వాడు గెలవటం చూస్తూంటే."

ఇక, తను పెద్దపెద్ద తిట్లు తిట్టటం వరకూ వచ్చింది. అంతటితో గానీ ఆమె నోరు మూతపడేదికాదు. ఆర్నెల్లక్రితం కాబోలు హఠాత్తుగా పక్షవాతం వచ్చి మంచంలో పడిపోయింది.

"శని విరగడైంది. వేళకింత తిండి పెడతాను. ఇక నా వెంటా, వెనకా తిరుగుతూ వూపిరి తియ్యదు !" అన్నది కమల పెద్దగానే.

"చచ్చినా ఏడవను !" అన్నాడతడు అక్కసుగా.

అయినా ఆమె నోరు వూరు కోవటం లేదు. ఆ గదిలో మనిషి అలికిడైతే చాలు "ఎవరు ? కమలా ! పొయ్యిమీద పాలు జాగ్రత్త చేశావా? పిల్లి తిరగదోస్తుందేమో కుండ ! గోపాలం ! వూళ్లో విశేషాలేమిటి ?" అంటూ ఇంకా యాతనపడుతూనే వుంది.

"నీ కెందు కవన్నీ ? కృష్ణా రామా అనుకో !" అంటాడు తను విసురుగా !

"మీ కెందుకా పెత్తనం ? చచ్చేదాకా సాధించేలా వున్నారు !" అంటుంది కమల.

ఈ మధ్య తామిద్దరికీ ఆమె చస్తే బావుండునన్న వూహ తరచూ కలుగుతోంది.

"ఈ ముసిల్ది చచ్చిందేమో చూస్తాను" అంటుంటాడు తరచూ తను.

వెంకటాద్రిలానే, అమ్మ మృత్యువు కూడా తను ఎంతగానో కోరుతున్నాడు. అయితే అది స్వాభావికంగా వస్తే బావుండునన్నదే వుంది.

"బావా ! బావా !"

తృళ్ళిపడి తలెత్తి చూశాడు. ఆలోచనలు ఎక్కడివక్కడ ఎగిరిపోయాయి గోపాలరావుకు.

వెంకటాద్రి ఇల్లు దాటుతున్నాడు. దుర్గ వాకిట్లో నిల్చుని పిలుస్తోంది. "ఏం ? ఎందుకూ ?" కటువుగా అడిగాడు చిన్నగా నడుస్తూనే.

"ఆయనగాని కనిపించారా? మధ్యాహ్నమనగా పొలంకేసి వెళ్లారు. ఇందాకారాలేదు. నువ్వూ మా చేనుమీదుగానేగా వస్తూంట?" ఆమె కంఠంలో ఆతురత, గోపాలరావు మనసులో ఆనందం! "ఇక వస్తాడులే, నీ మొగుడు; వచ్చినా రాత్రికి కుప్పల దగ్గరకు వెళతాడు. ఇక తిరిగిరాడు! రేపుచూస్తాను నీ మొహం. పనిమాలి అప్పుడప్పుడూ నన్ను పలుకరిస్తున్నావు కదూ కావాలని. రేపు నేనే నీ దగ్గరకు వచ్చి ఓదారుస్తాను" అతగాడి మనసు కసిగా అంది.

"ఏం బావా! కనిపించలేదా? ఏకంగా కుప్పల దగ్గరికి వెళ్ళారో ఏమిటో.... ఒళ్లు బాగాలేదని అన్నారు మధ్యాహ్నం!"

జవాబు చెప్పకుండానే సాగిపోయాడు. ఇలాటి సన్నివేశాలు ఆ బావా మరదళ్ళ మధ్య మామూలే కాబట్టి.... దుర్గ ఏమీ అనుకోలేదు. "పిచ్చి బావ! ఇంకా కోపం తగ్గలేదు." అని మాత్రం అనుకుంటుంది తరచూ!

గదిలోకి మెల్లగా పిల్లిలా వెళ్ళి, కండువాతీసి కోటు స్టాండుమీద వేశాడు గోపాలరావు.

ఆ కొద్దిపాటి అలికిడికే తల్లి....తట్టినట్లు లేచి "ఎవరూ? గోపాలమేనా? ఇంత పొద్దుపోయేవరకూ ఎక్కడ ఏం చేస్తున్నావురా?" అంది.

"........ప్చ! నీకింకా చావు రాలేదే అమ్మా!" మనసులో అనుకొనేమాట అప్రయత్నంగా పైకే అనేశాడు....

ఆమె త్రుళ్ళిపడ్డట్టు చూసింది .... .... "వస్తుందిలేరా నాయనా! చావును రమ్మని కోరాలా? మనం పిలిస్తే వస్తుందా? ఆ పిలుపు వచ్చాక నువ్వుండమన్నా ఒక్కక్షణం వుండను." ఆమె సణుగుడు ప్రారంభించింది.

"…. ఆ మంచిక్షణం ఎప్పుడో తెలిస్తే బావుండు…. " విసురుగా ఇంట్లోకి వెళ్ళిపోయాడు…. ఆ రాత్రంతా ఆతగాడికి నిద్ర సరిగాపట్టలేదు.

వెంకటాద్రి మరణం. ఆ తర్వాత తను పోటీలేకుండా ప్రెసిడెంటు కావటం…. దుర్గను తను ఓదార్చటం. ఆ క్షణంలో "చూశావా ? ఏం బావుకుందామని నన్ను కాదని వెళ్ళావు ?" అన్నట్లుగా వుంటాయి తన చూపులు ! "నిజమే ! ఏదో వయసు చాపల్యంతో ఇలా చేశాను !" అన్నట్లు దుర్గ చూపుల్లో పశ్చాత్తాపం…. రంగు రంగుల కలలు. మధ్య మధ్య కలత నిద్ర….

గోలగోలగా అరుపులు …. తృళ్ళిపడ్డట్లు మంచంమీది నుంచి లేచాడు గోపాలరావు, వూళ్లో కలవరం కాబోలు. వెంకటాద్రి పాముకరచి వరి మాగాణిలో…. కుప్పలదగ్గిర…. బిగుసుకు పోయున్నాడు కాబోలు…. వాళ్ళ పాలేర్లు చూచి…. గోలగోలగా పరిగెత్తుక వచ్చుంటారు.

ఒక్క వుదుటున బయటకు వచ్చాడు. ఎక్కడా ఏ సవ్వడీలేదు. కమల మాత్రం ఎద్దులకోసం వేరుశెనగపిండి నానవేసినకుండ సేద్యగాడు పగలగొట్టాడని, హెచ్చు స్థాయిలో కేకలేస్తోంది. సేద్యగాడు రాములు కూడా తను కావాలని పగులగొట్టలేదంటూ పెద్దగానే సంజాయిషీ చెప్పుతున్నాడు.

"వెధవ గోల ! ఏమిటా కేకలు ?" అనవసరంగా ముంచుకు వచ్చిన చికాకుతో ఇద్దర్నీ కేకలేశాడు. తను వూహించిన గోలకాకపోయే సరికి చిరాకుగానూ వుంది.

గబగబ గదిలోకి వెళ్ళి కండువా తీసుకున్నాడు. "ఈ ముసలామె ఇంకా ఛావలేదు కాబోలు !" అనవసరంగా తల్లిని తిట్టుకున్నాడు.

గదిలోంచి బయటకు రాబోతూ క్షణంసేపు ఆశ్చర్యంగా అక్కడే నిల్చుండిపోయాడు. చీమ చిటుక్కుమన్నా "ఎవర్రా అక్కడా?" అంటుందావిడ. అనలేదేమిటానిపించింది!

బోన్లే నిద్రపోతోంది మహారాణి! లేకుంటే ఆ వేరుశెనగపిండి కుండ పగిలినందుకు మంచంలో పడుండే యధాశక్తి గింజుకునేది! అనుకున్నాడు.

గది బయటకు వెళ్ళాడు. తిరిగి చెప్పుల కోసం గదిలోకి వెళ్ళాడు. ఈ మారూ తల్లి కదలలేదు....

"కొంపదీసి ముసల్ది చావలేదు కదా!"

ఎంచేతో తక్కున అనుమానం వచ్చింది. అప్రయత్నంగా తల్లి మంచంకేసి నడిచాడు....

కొద్దిగా నోరు తెరచివుంది....గాజుకళ్ళలా కనుపాపలు రెప్పల్లోకి పోయివున్నాయి!

"షాక్ కొట్టినట్లయ్యింది గోపాలరావుకు. తల్లిమీద చెయ్యి వేశాడు. మంచు ముక్కలా వుంది...."అమ్మా!" ఎంచేతో హృదయపు లోతుల్లోంచి వచ్చిందా పిలుపు. సమాధానం రాలేదు. ఇకరాదని తెలిసి పోయింది....

అమ్మ చనిపోయింది.... ఎప్పుడు? బహుశా వెంకటాద్రి చావును గురించి తను కలలు కంటూండిన సమయంలో అయ్యుండవచ్చు....!

మృత్యుచ్ఛాయ గది అంతా ఆవరించుకుని వున్నట్లనిపించిందా క్షణంలో....

"వస్తుందిలేరా నాయనా! చావును రమ్మని కోరాలా!" నిన్న రాత్రి ఆమె నిష్ఠూరంగా అన్నమాటలు లోపల్నుంచి ప్రతిధ్వనిస్తున్నాయి.

మరణం ఇంత విచిత్రంగా వస్తుందా? వూహించనంతటి వేగంగా వస్తుందా?

ఏదో నగ్నసత్యం అతగాడి హృదయంలో నుంచి జ్వాలలా పైకి వచ్చింది....

ఏదో చెప్పటానికి పరుగెత్తుక వచ్చిన కమల, భర్తవాలకం చూచి నిర్ఘాంతపోయింది. అనుక్షణం తాను కోరిన మృత్యువు తీరా ఎదురయ్యే సరికి ఇద్దరి హృదయాల్లోనూ .. తమమీద తమకే జుగుప్స కలిగింది.

క్షణంలో గోపాలరావు తల్లి చనిపోయిందన్న వార్త వూరంతా పాకిపోయింది. చిన్నా, పెద్దా అంతా చూడటానికీ, గోపాలరావును విచారించటానికీ రావటం మొదలెట్టారు.

తల్లి మరణం తెలుసుకున్న మరుక్షణం నుంచీ గోపాలరావు అంతరాంతరాలలో జరుగుతున్న సంఘర్షణ... ఆ భగవంతునికే తెలుసు....

........వీరిగాడు మర్చిపోయి.... పామును వదలకుండా వుంటే బావుణ్ణు........ఆ పాము వెంకటాద్రిని కరవకుండా వుంటే బావుణ్ణు. వెంకటాద్రి చావకూడదు. వెధవ ప్రెసిడెంటుగిరి.... అతగాడైతే ఏం? నేనైతే ఏం? దుర్గ పాపం మనసు పడి చేసుకుంది....వాళ్ళిద్దర్నీ విడదీసి నేను బావుకుతినేదేమిటి?....అసలు అతగాడి చావు కోరేందుకు నేనెవర్ని? నా మృత్యువు ఏ క్షణంలో, ఏ రూపంలో వస్తుందో నాకు తెలుసా?

అవే ఆలోచనలు ... పిచ్చివాడిలా తిరుగుతున్నాడు ఇల్లంతా. వచ్చిన వాళ్ళంతా గోపాలరావు తల్లి పోవటంతో పిచ్చివాడిలా అయి పోయాడంటున్నారు సానుభూతిగా.

అప్రయత్నంగా తలెత్తి చూచిన గోపాలరావుకు....వాకిట్లో దృశ్యం కన్నుల పండుగగా కనిపించింది. దుర్గ, వెంకటాద్రి వస్తున్నారు....

అతగాడు గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు. హాయిగా నిట్టూర్చాడు. అతగాడి పెదవులమీదకు నిండైన నవ్వు వచ్చేసింది.

దుర్గ, వెంకటాద్రి క్షణకాలం నివ్వెరపోయారు. తాము ఓదార్చటం మాట అటుంచి, గోపాలరావే తమకు ఎదురు రావటం ఆశ్చర్యమనిపించింది.

గోపాలరావు సంబాళించుకున్నాడు. దుర్గ, వెంకటాద్రి కాసేపు ఓదార్పు మాటలు చెప్పారు....

"ఏంతగండం తప్పిందో తెలుసా బావా! ఈయనకు ఇందాక!" అంది దుర్గ హఠాత్తుగా.

"ఇప్పుడా గొడవెందుకులే దుర్గా!" అన్నాడు వెంకటాద్రి....

"ఏమిటి?" కుతూహలంగా అడిగాడు గోపాలరావు.

"కుప్పల దగ్గర పడుకొని రాత్రంతా నిద్రలేదుట ఆయనకు. ఇందాక ఈ కబురు తెలిసి ఇక్కడకు రావాలని వస్తున్నారట....త్రోవలో నాలుగడుగుల పొడుగున్న నాగుబాము.... బుసలు కొడుతూ కాటేసేంత దగ్గరగా దూకిందట సమయానికి ఈయనచేతిలో ముల్లుకర్ర వుండటం ... దానికి ఆయువు మూడటం జరిగింది. లేకుంటే, ఈసరికి నా బ్రతుకేమై పోయుండేది?" దుర్గ భయంగా చేతులు గుండెమీద పెట్టుకుంది.

వెంకటాద్రి నవ్వాడు "ఊరికే నీకంతా కంగారు! కాలం రానిది పాము కరచినా చావరు.... కాలం దగ్గరకొస్తే మీ అత్తలా.... ఒక్క క్షణంలో చీమైనా కుట్టకుండానే చస్తారు!"

"ఔనౌను. నువ్వన్నది నిజం వెంకటాద్రీ!" అతగాడి భుజంతట్టూ ఆవేశంగా అన్నాడు గోపాలరావు.... అతగాడి మనసిప్పుడు హాయిగా, నిశ్చింతగా వుంది.

సరిగా తలెత్తి చూడనైనా చూడని బావ, తన భర్తనంత అప్యాయంగా చూడటం చూస్తుంటే ఆశ్చర్యమనిపించింది దుర్గకు.

వారం రోజుల తర్వాత, చీకటిపడి చేలోనుంచి వస్తున్న గోపాలరావు దగ్గరకు వడివడిగా పరుగెత్తుక వచ్చాడు వీరిగాడు.

"యిదుగోండి బాబుగారూ! తమరి డబ్బు" రహస్యంగా అటూఇటూ చూచి వంద రూపాయల నోటు తీసి ఇచ్చాడు.

"ఎందుకూ ?" విస్మయంగా అడిగాడు గోపాలరావు.

".... ఆ రోజు తమరు చెప్పినట్లు .... మాట నిలుపుకోలేక పోయాను...."

"ఏం చెప్పాను ?" ఇలాటి సన్నివేశం ఎదురైతే ఎలా ఎదుర్కోవాలన్నది ముందే ఆలోచించి పెట్టుకున్నాడు గోపాలరావు.

వీరిగాడు ఆశ్చర్యంగా చూశాడు. "తమరికి నిజంగా గుర్తు లేదా దొరా ? వెంకటాద్రి బాబును, పాము నొదిలి....ముగించమని....ఆ రోజు చిట్టడవిలో...."

"అట్లా చెప్పానా ?" క్షణకాలం గోపాలరావు నమ్మలేనట్లు చూశాడు. వీరిగాడు గుడ్లు తేలేశాడు.

"....చెప్పేవుంటాను వీరిగా. ఆ రోజు చిట్టడవిలో వెర్రాకు తొక్కానో ఏమో....పిచ్చివాడిలా అడివంతా తిరిగాను....దోవ తెల్సుకో లేకపోయాను. ఇంట్లో కూడా వెర్రిమాటలు మాట్లాడానట .. తర్వాత మా అమ్మా, నా భార్య చెప్పారు....! ఛీ....ఛీ....వెంకటాద్రిని చంపమన్నానా ? ఎంత తప్పు !"

వీరిగాడికి నిజంగా మతి పోయినట్లయింది. "తమరి మాటలు నిజమే ననుకొని పాము నొదిలాను....అదృష్టం కొద్దీ అది పొదలో

దూకింది. వెంకటాద్రిబాబు దాన్ని దాటుకొనే వెళ్ళిపోయారు ఆ రాత్రి.... మర్నాడు పుదయం మళ్ళీ పట్టుకొద్దామని వెళ్లాను. చచ్చిపడి వుంది. ఆ బాబుగారే కొట్టేశారట !"

"మంచిపని జరిగిందిలే వీరిగా ! వెర్రాకు తొక్కాను. మరెక్కడా అనబోకు....ఆ వందా తిరిగివ్వటం ఎందుకూ ? నా తిక్క మాటల వల్ల కాదూ నీ పాము జారిపోయింది. లేకుంటే అమ్మకునే వాడివిగా ! వుంచుకో. ఆ పాము ఖరీదు నే నిచ్చాననుకో...."

హుషారుగా ఇంటి కేసి నడిచాడు గోపాలరావు. మృత్యువు ఛ్ఛాయను గురించి ఆలోచించాలన్నా ఏవగింపుగావుంది అతగాడి కిప్పుడు.

* * * * * *

("జయశ్రీ" జనవరి 1972)